జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు



తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435



PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 142 శనివారం 18 అక్టోబరు- 2025 పేజీలు : 8 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.


## భారతదేశ పురోగతికి

# నదులే రహదారులు: ప్రధాని మోదీ

**జలమార్గాల అభివృద్ధిపై కేంద్ర మంత్రి సోనోవాల్ వ్యాసం షేర్ చేసిన ప్రధాని మోదీ**

**2014లో 5గా ఉన్న జాతీయ జలమార్గాలు ఇప్పుడు 111కి పెంపు**

**పదేళ్లలో 18 నుంచి 145 మిలియన్ టన్నులకు చేరిన సరకు రవాణా**

**రివర్ టూరిజంలోనూ భారీ వృద్ధి... 25 క్రూయిజ్ నౌకలు ఏర్పాటు**

**వికసిత్ భారత్ లక్ష్యంలో జలమార్గాలే కీలకమన్న కేంద్రం**



(సందేశం టైమ్స్) : భారతదేశ నదులు కేవలం వారసత్వ చిహ్నాలు మాత్రమే కావని, అవి దేశ ప్రగతికి కొత్త రహదారులుగా మారాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. గత కొన్నేళ్లుగా దేశంలో జలమార్గాలను అభివృద్ధి చేయడం ద్వారా రవాణా, పర్యాటక రంగాలు బలోపేతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ రాసిన ఒక ప్రత్యేక కథనాన్ని ప్రధాని శుక్రవారం తన 'ఎక్స్' సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. "వికసిత్ భారత్ నిర్మాణం దిశగా పునరుజ్జీవం పొందిన మన జలమార్గాలు ఎలా పయనిస్తున్నాయో" వివరిస్తూ సోనోవాల్ ఈ వ్యాసాన్ని రాశారు. ఒకప్పుడు మన దేశంలో నదులే ప్రధాన రవాణా మార్గాలుగా ఉండేవని, రోడ్లపై ట్రక్కుల హవా పెరగకముందే పట్నా, దిబ్రూగఢ్ వంటి ప్రాంతాల నుంచి కోల్‌కతాకు సరుకులు నదుల మీదుగానే చేరేవని సోనోవాల్ గుర్తుచేశారు. "భారత నదులే మన తొలి హైవేలు. కాలక్రమేణా రైలు, రోడ్డు మార్గాలు రావడంతో వాటి ప్రాధాన్యం తగ్గింది" అని ఆయన తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం, భారత అంతర్గత జలమార్గాల ప్రాధికార సంస్థ (ఐడబ్ల్యూఏఐ) కృషితో ఇప్పుడు నదులకు మళ్లీ పూర్వ వైభవం వస్తోందని సోనోవాల్ వివరించారు. 2014 వరకు దేశంలో కేవలం 5 జాతీయ జలమార్గాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 111కి పెరిగిందని, వీటిలో 32 ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్నాయని ఆయన వెల్లడించారు.

## ప్రధాని మోదీ పర్యటన సక్సెస్..

# అధికారులకు సీఎం చంద్రబాబు ప్రశంసలు



అమరావతి, అక్టోబరు 17(సందేశం టైమ్స్) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటన విజయవంతమైందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంత్రులు, వివిధ శాఖల అధికారులను సీఎం చంద్రబాబు అభినందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో ప్రధాని నాలుగోసారి పర్యటించారని తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ కార్యక్రమాల్లో మోదీ పాల్గొన్నారని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు.

ప్రధాని మోదీ పర్యటనలో భాగంగా కర్నూలు జిల్లాలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని ఉద్ఘాటించారు. ఈ సభ మంచి మెసేజ్ ఇచ్చిందని నొక్కిచెప్పారు. ప్రధాని మోదీ పర్యటనలో అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేశారని ప్రశంసించారు. ప్రధాని మోదీ సైతం పర్యటనను ఎంతో ఆస్వాదించారని పేర్కొన్నారు. శ్రీశైలం మల్లన్న ఆలయ దర్శనంపై ప్రధాని ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని వ్యక్తం చేశారని అన్నారు. ప్రధాని మోదీ సైతం సూపర్ జీఎస్టీ కార్యక్రమాలను అభినందించారని తెలిపారు. జీఎస్టీపై నెల రోజులపాటు చేసిన కార్యక్రమాలపై సమగ్రంగా ఒక పుస్తకాన్ని ప్రచురించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

# తండ్రి చెప్పిన మాటలను గుర్తు చేసుకున్న మంత్రి నాదెండ్ల

**రైస్ మిల్లర్లతో మంత్రి నాదెండ్ల సమావేశం**

**ఖరీఫ్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం ఈ నెల 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణ ప్రారంభం ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు వాట్సాప్ ద్వారా ధాన్యం కొనుగోలుకు సులభమైన రిజిస్ట్రేషన్**



అమరావతి, అక్టోబరు 17(సందేశం టైమ్స్) : పౌర సరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రోజు తన తండ్రి చెప్పిన మాటల ను మంత్రి నాదెండ్ల మనోహర్ మరోసారి గుర్తుచేసుకున్నారు. "పది మందికి ఉపాధి కల్పిస్తూ, గౌరవం కోసం పనిచేసే రైస్ మిల్లర్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి" అని తన తండ్రి సూచించారని ఆయన తెలిపారు. విజయవాడలోని తాజ్ వివంత హోటల్‌లో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన తండ్రి సూచనలు పాటిస్తున్నానని, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అందర్నీ కలుపుకొని పనిచేస్తున్న మిల్లర్లకు అండగా ఉంటానని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి నాదెండ్ల ప్రకటించారు.

## వైసీపీకి షాక్.. టీడీపీలోకి భారీగా చేరికలు

అమరావతి, అక్టోబరు 17(సందేశం టైమ్స్) : నెల్లూరు జిల్లాలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం మండలం సర్వేపల్లికి చెందిన 23 కుటుంబాలు టీడీపీ పార్టీలో చేరాయి. వేదాయపాళెంలోని టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పాత, కొత్త నాయకులు అందరూ కలిసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## రాజకీయ వ్యవస్థలో

# యువతను భాగస్వామ్యం చేస్తాం: పవన్ కల్యాణ్


అమరావతి, అక్టోబరు 17(సందేశం టైమ్స్) : రాజకీయ వ్యవస్థలో నవతరం యువతను భాగస్వామ్యం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. సమాజంలో మార్పు కాంక్షించే ప్రతీ ఒక్కరికీ వారి వంతు సేవలు మాతృభూమికి అందించే అవకాశం కల్పించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు పవన్ కల్యాణ్.



ఇందులో భాగంగా 'సేనతో సేనాని – మన నేల కోసం కలిసి నడుద్దాం' అంటూ ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని జనసేన నిర్వహించనుందని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ఔత్సాహిక యువతీ, యువకులు తమకు నచ్చిన అంశాన్ని ఎంచుకుని సేవలు అందించే అవకాశాన్ని ఈ వేదిక కల్పించనుందని తెలిపారు. మార్పు కోరుకుంటే రాదని.. మార్పు కోసం ప్రయత్నిస్తే వస్తుందని ఉద్ఘాటించారు. ఈ ప్రయత్నంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు.

## పరకామణి చోరీ కేసు:

# టీటీడీ ఈవోపై హైకోర్టు సీరియస్




**తిరుమల పరకామణి చోరీ కేసుపై హైకోర్టులో విచారణ**

**కౌంటర్ దాఖలు చేయకపోవడంతో ఈవోపై ఆగ్రహం ఈ నెల 27న వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ ఈవోకు ఆదేశం**

అమరావతి, అక్టోబరు 17(సందేశం టైమ్స్) : తిరుమల పరకామణిలో జరిగిన భారీ చోరీ కేసుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వహణాధికారి (ఈవో) వ్యక్తిగతంగా హాజరు కావాలని కఠిన ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం ఈ కేసు విచారణ సందర్భంగా, టీటీడీ అధికారుల తీరుపై న్యాయమూర్తి అసహనం ప్రదర్శించారు. కౌంటర్ దాఖలు చేయడంలో జాప్యంపై ప్రశ్నించారు. ఈ నెల 27న జరిగే తదుపరి విచారణకు ఈవో కచ్చితంగా హాజరుకావాలని, లేనిపక్షంలో రూ. 20 వేల జరిమానా విధించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కావాలని టీటీడీ తరఫు న్యాయవాది కోరడంతో, కోర్టు ఈ విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది.కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీఐడీ అధికారులు, ఇప్పటికే తిరుమల పరకామణిలోని కీలక దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తునకు సంబంధించిన ప్రాథమిక నివేదికను, సీజ్ చేసిన ఫైళ్లను కోర్టుకు సమర్పించారు.

# శ్రీవారి లడ్డూ ధరలు పెంచుతున్నారా?...

## క్లారిటీ ఇచ్చిన బీఆర్ నాయుడు

**తిరుమల లడ్డూ ధర పెంపుపై వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం ధరలు పెంచే ఆలోచన లేదని స్పష్టం చేసిన టీటీడీ ఛైర్మన్ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన బీఆర్ నాయుడు కొన్ని మీడియా సంస్థలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపణ టీటీడీ, ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయడమే లక్ష్యమని వ్యాఖ్య**



అమరావతి, అక్టోబరు 17(సందేశం టైమ్స్) : శ్రీవారి లడ్డూ ప్రసాదం ధరను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పెంచనుందంటూ కొన్ని రోజులుగా ప్రచారంలో ఉన్న వార్తలపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టత ఇచ్చారు. లడ్డూ ధరను పెంచే ఆలోచన తమకు ఏమాత్రం లేదని ఆయన తేల్చిచెప్పారు. ఈ మేరకు వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని, అవాస్తవమని కొట్టిపారేశారు. కొన్ని బాధ్యతారహిత మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి తప్పుడు వార్తలను ప్రసారం చేస్తున్నాయని బీఆర్ నాయుడు ఆరోపించారు. టీటీడీ ప్రతిష్ఠకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే దురుద్దేశంతోనే ఈ దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇలాంటి నిరాధారమైన కథనాలను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.భక్తులు ఎవరూ ఈ వదంతులను నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. పవిత్రమైన తిరుపతి లడ్డూ ప్రసాదం ధరను పెంచే ప్రతిపాదన టీటీడీ వద్ద ఎప్పుడూ లేదని, భవిష్యత్తులో కూడా అలాంటి ఆలోచన చేయబోమని బీఆర్ నాయుడు పునరుద్ఘాటించారు. టీటీడీపై బురద చల్లే ప్రయత్నంలో భాగంగానే కొందరు ఇలాంటి అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

# అబ్దుల్ కలాం మాటలను ఆచరణలోకి తీసుకురండి


# కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




(సందేశం టైమ్స్) "ఆకాశమే హద్దుగా కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండి" అని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకొని వాటిని జీవితంలో ఆచరణలోకి తీసుకురావాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ విద్యార్థులకు సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధులు శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం2025 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, సూర్యాపేటకు కొత్తగా బాధ్యతలు చేపట్టిన సమయంలో ఒక మహిళ అబార్షన్ కారణంగా మృతి చెందడం బాధ కలిగించిందని తెలిపారు. ఆ సంఘటనతో మహిళా సమస్యలను సమగ్రంగా పరిష్కరించాలనే సంకల్పంతో "బాలిక చైతన్యం" అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నెలకు నాలుగు వారాల్లో పాఠశాలల్లో పోలీస్, వైద్య, మహిళా శిశు సంక్షేమ, విద్యాశాఖల అధికారులు విద్యార్థులకు సైబర్ నేరాలు, పోషణ, మహిళా భద్రత, సాధికారత, కెరీర్ గైడెన్స్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. సోషల్ మీడియాలో తెలియని వ్యక్తుల ప్రలోభాలకు గురికాకుండా మహిళలు ధైర్యంగా ఉండాలని, అలాంటి వేధింపులు ఎదురైనప్పుడు వెంటనే షీ టీమ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు పొందవచ్చని, గర్భంలోనే ఆడ శిశువులను గుర్తించి భ్రూణహత్యలు చేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి చర్యలపై పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాఠశాలల్లో ఆడపిల్లల ప్రతిభను ప్రశంసిస్తూ, భవిష్యత్తు లక్ష్యాలను విద్యార్థి దశలోనే నిర్ణయించుకోవాలని, కుటుంబ పెద్దల సలహాలు తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. విద్య ద్వారానే లింగ వివక్షత, భ్రూణహత్యల నిర్మూలన సాధ్యమని చెప్పారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని, మంచి ఆహారం, పోషకాహారం తీసుకుంటేనే మంచి ఆలోచనలు వస్తాయని గుర్తు చేశారు. చదువు లేకపోతే ఆలోచించే శక్తి తగ్గిపోతుందని మహాత్మ జ్యోతిబా ఫూలే మాటలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో 5,200 మంది అడ్మిషన్లు ఉండగా, ఈ సంవత్సరం 10,000 మందికి పైగా చేరడం సంతోషకరమని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళికపై చొరవ చూపాలని సూచించారు. మంచి ఆలోచనలు మాటలుగా, మాటలు కార్యాచరణగా మారుతాయని, మంచి అలవాట్లు మంచి వ్యక్తిత్వం, మంచి భవిష్యత్తును నిర్మిస్తాయని చెప్పారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ బాలికలు, మహిళల రక్షణకు కృషి చేయాలని, వారి సామర్థ్యాలను పెంచేందుకు సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ కె. సీతారామరావు మాట్లాడుతూ, లింగ వివక్షతను మొగ్గ దశలోనే నిర్మూలించాలని, విద్య ద్వారానే మహిళలు ఆకాశంలో అవకాశాలను అధిరోహించగలరని తెలిపారు. సోషల్ మీడియా ప్రలోభాలకు లోనుకాకుండా చదువు పై దృష్టి పెట్టాలని విద్యార్థినిలకు సూచించారు. 2024లో ఐపీఎస్‌లకు ఎంపికైన వారిలో 35.5% మహిళలు, మెడిసిన్ కోర్సుల్లో 66.6% మహిళలు ఉన్నారని ఉదాహరించారు. ప్రభుత్వంలో అనేక అవకాశాలు ఉన్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇవ్వాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1098 కి కాల్ చేయాలని, ఆ నంబర్ అన్ని పాఠశాలల్లో ప్రదర్శించాలని సూచించారు. కేజీబీవీ చివ్వేంల విద్యార్థినిలు రుద్రమదేవి, కలెక్టర్, డాక్టర్, టీచర్ వంటి వేషధారణలతో కళా ప్రదర్శన చేశారు. షీ టీమ్స్ పోలీసులు మహిళా రక్షణపై పాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డిడబ్ల్యుఓ నరసింహారావు, సిడబ్ల్యుసి చైర్మన్ రమణరావు, డీఎంహెచ్ఓ చంద్రశేఖర్, ఎస్‌హెచ్ఓ నీలిమ, జీసీడీఓ పూలన్, మహిళా సాధికారత కోఆర్డినేటర్ చైతన్య, సఖి, భరోసా, షీ టీమ్స్ సిబ్బంది, కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బదిలీ మహోత్సవ వేడుక సన్మాన కార్యక్రమం




(సందేశం టైమ్స్)సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 17అక్టోబర్ మెదక్ జిల్లా పరిధిలోని స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్‌గా విజయవంతంగా సేవలందించిన శ్రీ డి. మల్లేశయ్య కి ఘన సన్మానం అందజేసిన వేడుకలు ప్రతిష్టాత్మకంగా జరిగాయి. డిపో ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మాధ్యమ ప్రతినిధులు పెద్దఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా, డిపోలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డిపో మేనేజర్ వీవీఎస్ సుబ్రహ్మణ్యంను పరిచయం చేస్తూ, మెకానికల్ ఇంజనీర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నందులాల్ తదితరులు పాల్గొన్నారు. మల్లేశయ్య గారికి సహచరులు పూలమాలలతో, ప్రత్యేక బహుమతులతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇంత అందంగా సన్మానం జరగడం చాలా అరుదైనదిగా పరిగణిస్తున్నారు. ఈ కార్యక్రమానికి వట్టిపల్లి పీఠాధిపతి ముకుందరావు అప్పా గారు ప్రత్యేక ఆకర్షణగా విచ్చేశారు. అలాగే, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు హాజరై మల్లేశం గారికి అభినందనలు తెలిపారు. తన సేవల కాలంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, సమర్థవంతంగా పనిచేసిన మల్లేశం గారు త్వరలో వరంగల్ ఏటీఎం (ఆర్డినరీ ట్రాన్స్పోర్ట్ మేనేజర్)గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మల్లేశయ్య, "నా మీద అభిమానంతో, గౌరవంతో విచ్చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను"అనిఅన్నారు.

## రాష్ట్రవ్యాప్త బీసీ బంద్‌కు మద్దతు తెలుపుతూ బంద్ ను విజయవంతం చేయాలి

### ఎమ్మెల్యే చింతా ప్రభాకర్




(సందేశం టైమ్స్)సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 17అక్టోబర్ సంగారెడ్డి: బీసీ వర్గాల హక్కుల సాధన కోసం ఈనెల 18వ తేదీన చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌కు బి ఆర్ ఎస్ పార్టీ మద్దతు ప్రకటించింది. జిల్లా ప్రజలు బంద్ ను విజయవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు కోసం రాష్ట్రవ్యాప్త బంద్ ఒక శాంతియుత నిరసన రూపమని,బంద్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీల శ్రేయస్సు కోసం పోరాటం కొనసాగుతుందని, సమాజ అభివృద్ధి కోసం ఇది ఒక ఆవశ్యక దశ అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజలు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, సంఘాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని బీసీ సమాజ ఐక్యతను చాటాలని ఆయన అభిప్రాయ పడ్డారు...బీసీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ మద్దతు కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టంచేశారు....

## బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ బంద్ పిలుపు

## అక్టోబర్ 18న బీసీ సంఘాల బంద్‌కు విస్తృత మద్దతు


(సందేశం టైమ్స్) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 17 అక్టోబర్ 2025 బీసీ రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాలు అక్టోబర్ 18న రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ బంద్‌కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, అలాగే ప్రతిపక్ష పార్టీలతో పాటు పలు సామాజిక సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించడం గమనార్హం. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ (BSP) నారాయణఖేడ్ అసెంబ్లీ ప్రెసిడెంట్ మలిగదొడ్డి పండరి ఒక కీలక వ్యాఖ్య చేశారు. "ఈ దేశంలో బీసీల హక్కుల కోసం బీఎస్పీ ఎన్నో సంవత్సరాలుగా పోరాడుతోంది. 'మనకు ఎంతో, మనకు అంత' అన్న న్యాయబద్ధమైన నినాదంతో ఎవరి జనాభా మేరకు వారికి వాటా ఇవ్వాలని అప్పుడు చెప్పిన మాట ఇప్పటికీ ప్రాముఖ్యతనూ, ప్రాధాన్యతనూ పొందుతోంది" అని అన్నారు.

### అలాగే, పండరి ఆవేదనతో పేర్కొన్నారు :


"ఈ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది ఎవరు? వాళ్లు అజ్ఞాత వ్యక్తులా? లేక లభ్యమైన అధికారాలపై ఓ పెద్ద కబంధహస్తమా? బీసీ మేధావులు, సమాజం అంతా ఈ ప్రశ్నపై చర్చించాలని, సమాధానం కనుగొనాలని కోరుతున్నాను."

### ఇంకా మాట్లాడుతూ,

"ఇప్పటికీ మనం అగ్రవర్ణాల ఆధిపత్యానికి బానిసలుగా ఉన్నామా? బీసీ, ఎస్సీ, ఎస్టీలతో కలిపి దేశ జనాభాలో 85% మంది ఉన్నాం. కానీ అధికారంలో మాత్రం మన ఉనికి కనిపించదు. ఇది సరిచేయాలంటే మనం కలిసినప్పుడే సాధ్యం. మనం కలిస్తే నిలుస్తాం, నిలిస్తే గెలుస్తాం. ఇది ఆత్మచైతన్యానికి సమయం" అని పిలుపునిచ్చారు. బీసీల హక్కుల సాధన కోసం శాంతియుతంగా ఉద్యమించేందుకు ప్రతి బహుజనులూ ముందుకు రావాలని ఆయన కోరారు. అక్టోబర్ 18న బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాలకు, ప్రజలకుపిలుపునిచ్చారు.




## పత్రిక స్వేచ్ఛను హరించడం సరికాదు




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 17అక్టోబర్ సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి పై అక్రమ కేసులు పెట్టి పత్రిక స్వేచ్ఛను అడ్డుకోవలనుకోవడం సరికాదని జర్నలిస్ట్ సంఘాల నాయకులు రమేష్, విట్టల్, సాయిరాం శెట్కార్ లు అన్నారు. ఎడిటర్ పై కేసుల నమోదును నిరసిస్తూ నల్లబ్యాడ్జిలు ధరించి తహసీల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. తహసీల్దార్ ఆశజ్యోతికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఏపి ప్రభుత్వ పెద్దల వత్తిడి తోనే ఎడిటర్ పై వరుసగా కేసులు పెట్టి, నోటీసులు జారీ చేస్తున్నారని ఆరోపిం చారు. ఎడిటర్ పై కక్ష పూరిత చర్యలను వెంటనే ఆపాలని డిమాం డ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన మీడియా స్వేచ్ఛను హరిం చడం పై కుట్ర కోణం ఉందన్నారు. కలానికి సంకె ళ్లు వేయా లనే ప్రభుత్వ కుట్రల పై నిరసన కొన సాగి స్తామ న్నారు. కార్య క్రమం లో వివిధ పత్రికా విలేకరులు పండరి, ప్రశాంత్,ఆనంద్, శ్రీని వాస్,మ్యాతరి ప్రవీణ్ కుమార్‌ఉన్నారు.

# చేప పిల్లలు విడుదలకు చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య





(సందేశం టైమ్స్) సంగారెడ్డి టౌన్ ప్రతినిధి 17అక్టోబర్ సంగారెడ్డి జిల్లాలో చేపల ఉత్పత్తి పెంపుతో పాటు మత్స్యకారుల ఆర్థిక స్థితి మెరుగుపరచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని నీటిమనరులైన చెరువులో కుంటలు ప్రాజెక్టులలో చేప పిల్లలు విడుదలకు చేయాల్సిన ఏర్పాట్లపై సన్నాహాక సమావేశం అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) చంద్ర శేఖర్ , మత్స్యశాఖ అధికారి మధుసూదన్, నీటి పారుదలశాఖ అధికారి జనార్ధన్ ,డి పి ఓ సాయిబాబా లతో కలిసి నిర్వహించారు . ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ ... చేప పిల్లల విడుదల ద్వారా మత్స్యకారుల కు ఆర్థికంగా ప్రయోజనం కలగడంతో పాటు వారి జీవన వారి జీవన విధానం బలోపేతం అవుతుందని తెలిపారు . జిల్లాలో మొత్తం 1025 సీజనల్ చెరువులు, అలాగే 79 దీర్ఘకాలంగా నీరు నిల్వ ఉండే చెరువులు ఉన్నాయని, వీటిలో . సింగూరు ప్రాజెక్టు, సదాశివపేట మండలం, తంగడపల్లి నీలగిరి ప్రాజెక్టులు, నారాయణఖేడ్ డివిజన్ , పరిధి లోని సిర్గాపూ ర్ మండలం లోని నల్లవాగు ప్రాజెక్టు, లలో చేప పిల్లల విడుదలకు అనుకూలమైన నీటి వనరులు పుష్కలంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.చేప పిల్లల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. మత్స్యశాఖ అధికారులు క్వాలిటీ చెక్ ప్రక్రియను ఖచ్చితంగా పాటించాలని, నాణ్యమైన చేప పిల్లలే చెరువుల్లో విడుదల చేయాలన్నారు. ఎంపీడీవోలు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసి, ప్రతి పంచాయతీ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించి ఈ కార్యక్రమం విజయవంతం కోసం కృషి చేయాలన్నారు. పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ మత్స్యశాఖల అధికారులు బాధ్యతగా సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మత్స్యశాఖ అధికారులకు సమన్వయం, రికార్డు నిర్వహణ, చెరువుల ఎంపిక, నీటి స్థాయిల పరిశీలన, విత్తనాల నాణ్యత వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. అధికారులు సమగ్ర ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు . చేప పిల్లల విడుదల కార్యక్రమం, పారదర్శకంగా ఉండేలా మత్స్యకారుల సంఘాల సమక్షంలోనే చేప పిల్లలు నీటి వనరులలో విడుదల చేయాలని ఆదేశించారు. అలాగే ప్రజా ప్రతినిధులను తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ డీవోలు,సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాస కార్యక్రమం

### విద్యార్థులకు మార్గదర్శనం -క్రియేటివ్ కృష్ణ






(సందేశం టైమ్స్)సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి అక్టోబర్ 17 సంగారెడ్డి జిల్ల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల నందు వ్యక్తిత్వ వికాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ మోటివేటర్, మార్గదర్శకుడు,స్పీకర్ క్రియేటివ్ కృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.తన ప్రసంగంలో విద్యార్థుల జీవిత లక్ష్యాలను నిర్ణయించుకోవడం, క్రమశిక్షణ ,సానుకూల ఆలోచన మరియు ఆత్మవిశ్వాసంవంటి అంశాలపట్ల ప్రముఖమైన వివరణ ఇచ్చారు.విజయం అనేది ఒకరోజులో వచ్చే అద్భుతం కాదు, ప్రతిరోజూచేసే చిన్న చిన్న ప్రయత్నాల ఫలితం అని పేర్కొన్నారు.విఫలతలకు భయపడకుండా ముందుకు సాగాలని,ప్రతి విద్యార్థి తమలోని ప్రతిభను గుర్తించి దానిని అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి మోటివేషన్ కార్యక్రమాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి ,వారి ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాయి.కృషి నిబద్ధతవుంటే ఎంతటి కార్యామైన సాధించవచ్చు అని అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కారక్రమాన్ని విజయవంతంచేశారు.

## రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయండి

### బీసీ జేఏసీ పిలుపు



(సందేశం టైమ్స్)నారాయణ ఖేడ్ నియోజకవర్గ ప్రతినిధి17అక్టోబర్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలును డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ పిలుపునిచ్చిన రాష్ట్రబంద్‌ను విజయవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మరియు బీసీ జేఏసీ కన్వీనర్ పట్లోళ్ల మల్లికార్జున్ పాటిల్ పిలుపునిచ్చారు.ఈ మేరకు ఓ పత్రికా ప్రకటనలో ఆయన స్పందిస్తూ, రేపు జరిగే బంద్‌లో జిల్లావ్యాప్తంగా ఉన్న బీసీ ప్రజలు అందరూ చురుకుగా పాల్గొనాలని కోరారు. 42% రిజర్వేషన్ల అమలు బీసీ జనాభాకు న్యాయమైన హక్కు అని పేర్కొన్నారు.ఈ ఉద్యమం బీసీల భవిష్యత్‌ను నిర్ణయించే సంక్షేమ యత్నమని, అందరూ ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. బంద్‌ను శాంతియుతంగా నిర్వహించి ప్రభుత్వానికి బలమైన సందేశం పంపించాలని ఆయన పిలుపునిచ్చారు.

## డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలి

### మంత్రి దామోదర రాజనర్సింహ



(సందేశం టైమ్స్)సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి అక్టోబర్ 17 రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. తెలంగాణలో మత్తు పదార్థాల వ్యసనాన్ని పూర్తిగా అరికట్టాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యం ఉంటేనే ఈ లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనపై పోరులో పోలీసు, ఆరోగ్యశాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ మేరకు ఇరు డిపార్ట్‌మెంట్ల ఉన్నతాధికారులతో మంత్రి శుక్రవారం సెక్రటేరియట్‌లో సమీక్ష చేశారు.ఈ సమావేశంలో టీఏఎన్‌బీ (Telangana Anti—Narcotics Bureau) డైరెక్టర్ సందీప్ శాండిల్య, హెల్త్ సెక్రటరీ, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, టీఏఎన్‌బీ ఎస్పీ రూపేశ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరింటెండెంట్, డాక్టర్ అనిత, న్యాయ శాఖ అడిషనల్ సెక్రటరీ సునీత తదితరులు పాల్గొన్నారు.రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తీసుకుంటున్న చర్యల గురించి సందీప్ శాండిల్య మంత్రికి వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటైన వారిని గుర్తించి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తున్నామని, ఆ తర్వాత వారిని డీఅడిక్షన్ సెంటర్లకు తరలించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలు అయినవారిని గుర్తించేందుకు ఆరోగ్యశాఖ సహకారం తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన లక్ష్యాన్ని చేరుకోవడం కేవలం ప్రభుత్వంతో సాధ్యం కాదు అని, సమాజంలోని అన్ని వర్గాలనూ ఈ పోరాటంలో భాగస్వామ్యం చేయాలని అధికారులకు సూచించారు.పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు, టీచర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.మత్తు పదార్థాలు తీసుకుంటున్న వారిలో వచ్చే బిహేవియరల్ చేంజెస్ గురించిన అవగాహన ప్రతి పేరెంట్‌కు, టీచర్‌కు ఉండాలన్నారు.ఈ విషయంలో విస్తృత ప్రచారం జరగాలని మంత్రి సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, స్కూళ్లు, కాలేజీలు, హాస్పిటళ్లలో రెగ్యులర్‌గా కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు.క్షేత్రస్థాయి



ఆరోగ్య కార్యకర్తల ద్వారా గ్రామాల్లో, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. అన్ని విద్యా సంస్థల్లో యాంటి నార్కొటిక్స్ వింగ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.డ్రగ్స్ వినియోగం నుంచి బయటపడేసేందుకు అవసరమైన డీ అడిక్షన్ సెంటర్లను బలోపేతం చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని టీచింగ్ హాస్పిటళ్లలో డీఅడిక్షన్ వార్డులు ఏర్పాటు చేశామని తెలిపారు.ఎర్రగడ్డలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ ప్రాంగణంలో అత్యాధునిక వసతులతో డీఅడిక్షన్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని, అలాగే అవసరాన్నిబట్టి మరిన్ని సెంటర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.మత్తు పదార్థాలకు అలవాటైన పిల్లలను తల్లిదండ్రులే డీఅడిక్షన్ సెంటర్లకు తీసుకురావాలని మంత్రి కోరారు. పూర్తి ఉచితంగా వారికి కౌన్సెలింగ్, చికిత్స అందిస్తామని తెలిపారు.పిల్లలకు మత్తు పదార్థాలకు అలవాటైనట్టు గుర్తించాక ఆలస్యం చేయొద్దని, ఆలస్యమయ్యేకొద్దీ వారి ఆరోగ్యం మరింత పాడయ్యే ప్రమాదంఉంటుందన్నారు.

## ఒకే రకం మాత్రలు .. రెండు రకాల ధరలు..!



నార్పల (అనంతపురం) :అక్టోబరు17 (సందేశం టైమ్స్): మండల కేంద్రమైన నార్పల అపోలో మెడికల్ స్టోర్ లో ఒకే రకమైన మాత్రలకు రెండు రకాల ధరలు వసూలు చేస్తున్నారు. రెండు రకాల రేట్లు ఎందుకు వేశారని వినియోగదారులు ప్రశ్నిస్తే కొత్త స్టాకు కొత్త ధరలు పాత స్టాకు పాత ధరలు వర్తిస్తాయి అంటూ మందులపై ఉన్నటువంటి ధరలను చూపిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో వినియోగదారులు ఔషధాలు కొనడానికి వెళ్తే సగం మాత్రలు కొత్త స్టాకు సగం మాత్రలు పాత స్టాక్ ఇస్తూ ఒకే రకమైన ఔషధానికి రెండు రకాల బిల్లులు వేసి వసూలు చేస్తున్నారు. చాలామంది గ్రామీణ ప్రాంత ప్రజలు అపోలో మందుల దుకాణంలో బయట దుకాణాల కంటే తక్కువ ధరలకు మందులు లభిస్తాయని ఇక్కడికి వస్తే ఇక్కడ కూడా దోపిడీ తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అనంతగిరి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన

## జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్




(సందేశం టైమ్స్): సూర్యాపేట జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కె. నరసింహ ఐపీఎస్ గారు ఈరోజు అనంతగిరి మండల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని పరిసరాలు, రికార్డులు, డైరీలు, రిసెప్షన్ రిజిస్టర్లు పరిశీలించారు. మండల పరిధిలో నమోదవుతున్న నేరాలు, ఫిర్యాదుల పరిష్కారం, కేసుల దర్యాప్తు స్థితి, అక్రమ రవాణా నిరోధం, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, పాత నేరస్తుల కదలికలపై నిఘా తదితర అంశాలపై విపులంగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ "పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలి. పారదర్శకంగా పని చేస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించాలి. నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి" అని సూచించారు. అలాగే గ్రామ రిజిస్టర్లు, హిస్టరీ షీట్స్, రౌడీ షీట్స్, సస్పెక్ట్ షీట్స్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, బ్లూ కోట్ విధులు, ప్యాట్రో కార్ విధులు సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. సంఘటన స్థలానికి త్వరగా చేరుకుని బాధితులకు భరోసా కల్పించడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని అన్నారు. కేసులు పెండింగ్ లేకుండా చురుకైన చర్యలు తీసుకోవాలని, జట్టుగా పనిచేస్తూ లక్ష్యంతో ముందుకు సాగితే పోలీస్ శాఖ మరింత విజయాలను సాధించగలదని ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు పేర్కొన్నారు.




# సూర్యాపేటలో స్వీట్, బేకరీ షాపులపై ప్రత్యేక తనిఖీలు

## 60 కిలోల లేబుల్ లేని ఆహార పదార్థాలు

## సీజ్ ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ బట్టి ప్రభాకర్






ఆహార భద్రతా ప్రమాణాల అమలులో భాగంగా శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని వివిధ స్వీట్ షాపులు మరియు బేకరీలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ బట్టి ప్రభాకర్ తెలిపారు. ఈ తనిఖీల్లో బెంగళూరు అయ్యంగార్ బేకరీ, డాల్ఫిన్ బేకరీ, ఎల్.ఎస్. బేకరీ, ఫేమస్ బేకరీ, మిఠాయి పోట్లం శ్రీ మిత్ర, శివ బేకరీ వంటి సంస్థలను పరిశీలించారు.

### తనిఖీల్లో గుర్తించిన లోపాలు:

బేకరీలలో పరిశుభ్రత (Sanitary Maintenance) మరియు సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత (Personal Hygiene) పాక్షికంగా మాత్రమే పాటించబడుతున్నట్టు గుర్తించారు. సిబ్బందికి సంబంధించిన వైద్య ధృవపత్రాలు (Medical Certificates) నిర్వహించడం లేదు.

### డాక్టర్ బట్టి ప్రభాకర్ మాట్లాడుతూ

"ప్రజల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించే వారిపై కఠిన చర్యలు తప్పవు. భవిష్యత్తులోనూ ఇలాంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయి"అనితెలిపారు.

### తీసుకున్న చర్యలు:

సింథటిక్ రంగులు (Synthetic Colors) వాడకంతో కలిగే హానికర ప్రభావాలపై షాపుల యజమానులు, సిబ్బందికి అవగాహన కల్పించారు.

అనుమానం ఉన్న కొన్ని నమూనాలను (Suspected Samples) సేకరించి ప్రయోగశాల పరీక్షల కోసం పంపించారు.

గడువు ముగిసిన (Expired) ఆహార పదార్థాలను వెంటనే ధ్వంసం చేయించారు.

లేబుల్ లేకుండా నిల్వ ఉంచిన సుమారు 60 కిలోల ఆహార పదార్థాలను సీజ్ చేశారు

# ఈశాన్య రుతుపవనాలతో భారీ వర్షాలు



లఅమరావతి బ్యూరో :అక్టోబరు17 (సందేశం టైమ్స్)::ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో ప్రకాశం, ఎస్పిఎస్ఆర్ నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో శుక్రవారం అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఒక ప్రకటనలో పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడిచింది. దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 35 నుంచి 55 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్లు, భారీ హోర్డింగుల వద్ద నిలబడవద్దని హెచ్చరించింది. రాష్ట్రంలో గురువారం ఎస్పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా అనంతసాగరంలో 31.7 మిల్లీమీటర్లు, దూబగుంటలో 27.2 మిల్లీ మీటర్లు, కడప జిల్లా కేంద్రంలో 28.5 మిల్లీ మీటర్లు, ప్రకాశం జిల్లా పొదిలిలో 25.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపింది.

# కవి కొల్లూరి ఇకలేరు



విజయవాడ, అక్టోబరు17 (సందేశం టైమ్స్): సాహితీలోకంలో ఎక్స్ రే కొల్లూరిగా ప్రఖ్యాతిగాంచిన కొల్లూరి సూర్యనారాయణమూర్తి (69) సాయంత్రం తాడేపల్లిలోని ఓ ఆస్పత్రిలో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. కొల్లూరి రాసిన ఓ కవిత పేరు 'ఎక్స్ రే'. ఆ పేరుతోనే సాహితీలోకం

లో ప్రఖ్యాతిగాంచారు. అమలాపురంలో పుట్టి పెరిగారు. విజయవాడ వచ్చి స్థిరపడ్డారు. ఎక్సరే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ స్థాపించి అనేక సాహిత్య, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆనాటి మినీ కవితా ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. విజయబాబు సంపాదకత్వంలోని చిరంజీవి మాసపత్రికలో ఉపసంపాదకులుగా కొంతకాలం పనిచేశారు. మంచి సాహిత్యాన్ని రికార్డు చేసే ప్రయత్నంలో భాగంగా కవిత్వానికి ఎక్స్ రే అవార్డులను అందజేశారు. నలభై ఏళ్లుగా ఎక్స్ రే అవార్డులను ఇచ్చిన ఘనత ఎక్స్ రే కొల్లూరికే దక్కుతుంది. ఈ సంవత్సరమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది పురస్కారంతో ఆయనను సత్కరించింది.

# కాలుష్యంతో చనిపోతున్నా పట్టదా!



## కేన్సర్ బారిన పడి మృతి చెందిన మత్స్యకారుల చిత్రపటాలతో నిరసన బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయొద్దని గంగపుత్రుల డిమాండ్

నక్కపల్లి (అనకాపల్లి) అక్టోబరు17 (సందేశం టైమ్స్):మేమంతా కాలుష్యం బారిన పడి చనిపోతున్నా ఎవ్వరికీ పట్టడం లేదు. మళ్లీ మా నెత్తిన బల్క్ డ్రగ్ పార్కు ప్రాజెక్టు పెట్టి మరింత దు:ఖానికి కారణమవుతున్నారు' అంటూ అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. కేన్సర్, ఇతర అనారోగ్యాల బారిన పడి మృతి చెందిన మత్స్యకారుల ఫొటోలను ప్రదర్శిస్తూ గురువారం నిరసన తెలిపారు. బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినదించారు. మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేపట్టిన రిలే దీక్షలు 33వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వద్దే చేపట్టిన నిరసనలో బాధిత కుటుంబ సభ్యులు, మత్స్యకారులు మాట్లాడుతూ హెటిరో డ్రగ్స్ కంపెనీ కాలుష్యం కారణంగా కేన్సర్, శ్వాసకోశ, కిడ్నీ సంబంధిత వ్యాధులతో ఇప్పటికే పలువురు చనిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. ఒక్క హెటిరో కంపెనీ కాలుష్యం కారణంగా గ్రామ ప్రజలకు ఇటువంటి పరిస్థితి నెలకొందని, బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేస్తే తామంతా ఎలా జీవించగలమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడ్డాయన్నారు. తమ ప్రాంతంలో పర్యావరణం పూర్తిగా దెబ్బతిందని, భూగర్భ జలాలు కలుషితమయ్యాయని తెలిపారు. పలువురు రోగాల బారిన పడి మంచాన పట్టారన్నారు. ఆర్థిక ఇబ్బందులతో పలువురు వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా ఇలా ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేసి తమ మనుగడ లేకుండా చేసే పనిలో ప్రభుత్వం ఉండడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. తమ జీవన విధానం, ఉనికిని దృష్టిలో పెట్టుకుని బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# 3 రోజుల్లో రూ.1.22 కోట్ల ఆదాయం

–అమరావతి బ్యూరో :అక్టోబరు17 (సందేశం టైమ్స్): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ డ్రైవ్‌లో భాగంగా మూడు రోజుల టికెట్ తనిఖీల ఆదాయం రూ. 1.22 కోట్లు వసూలు చేసినట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకూ టికెట్ లేని ప్రయాణానికి సంబంధించి 7,928 కేసులు, అక్రమ ప్రయాణానికి సంబంధించి 9,034 కేసులు, లగేజి బుక్ చేయని కేసులు 55 నమోదు చేసినట్లు తెలిపారు. డివిజన్‌లో గతంలో ఎన్నడూ వసూలు చేయనంత జరిమానా వసూలు చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటెన్సివ్ డ్రైవ్‌లో రైళ్లు, స్టేషన్లలో ప్రతి రోజు 716 మంది టికెట్ తనిఖీ సిబ్బంది పని చేశారన్నారు. టికెట్ రహితంగా ప్రయాణించడం నేరమని విజయవాడ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బి.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. చెల్లుబాటు అయ్యేలా టిక్కెట్‌తో ప్రయాణించి, సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# త్వరలో కౌలు రైతులకూ విశిష్ట గుర్తింపు సంఖ్య

అమరావతి,అక్టోబరు17 (సందేశం టైమ్స్):భూములున్న రైతులకు మాదిరిగానే పంట సాగుదారు హక్కుపత్రం(సీసీఆర్సీ) ఉన్న కౌలు రైతులకూ విశిష్ఠ గుర్తింపు సంఖ్య(ఐడీ) కేటాయించేందుకు విధివిధానాలు రూపొందిస్తున్నట్లు వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీ రాజశేఖర్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో కేంద్ర, రాష్ట్ర అధికారులతో కౌలు రైతులకు ఐడీ కేటాయింపు విధివిధానాల ఖరారుకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ... 'కౌలు రైతులకు ఐడీ కేటాయింపుపై సాంకేతికంగా పరీక్షించిన తర్వాత పూర్తి స్థాయిలో అమలు చేస్తాం. దీని వల్ల కౌలు రైతులు కూడా భూములున్న రైతులతో సమానంగా ప్రభుత్వం ద్వారా అన్ని ప్రయోజనాలనూ పొందగలుగుతారు' అని చెప్పారు. అగ్రిస్టాక్ అధికారి రాజీవ్ చావ్లా, కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సలహాదారు సమర్ధరామ్, సీసీఎల్ఏ జయలక్ష్మి, వ్యవసాయ, ఉద్యానశాఖ డైరెక్టర్లు మనజీర్ జిలానీ, శ్రీనివాసులు, సాయిల్ సర్వే అధికారులు పాల్గొన్నారు.



కాగా వ్యవసాయ విస్తరణాధికారుల సమస్యలపై త్వరలో సమావేశం నిర్వహిస్తామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలానీ హామీ ఇచ్చినట్లు రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘ అధ్యక్షుడు వేణుమాధవరావు తెలిపారు.

# శ్రీకాకుళం జిల్లాలో 209 కిలోల గంజాయి స్వాధీనం



శ్రీకాకుళం, అక్టోబరు17 (సందేశం టైమ్స్): శ్రీకాకుళం జిల్లాలో భారీస్థాయిలో గంజాయిని పోలీసుల ఆధ్వర్యంలో ఈగల్ టీమ్ స్వాధీనం చేసుకుంది. ఎస్పీ మహేశ్వరరెడ్డి కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌లోని ఘజయాబాద్‌కు చెందిన సునీల్, మేరఠ్‌కు చెందిన విశాల్.. ఒడిశా రాష్ట్రంలో 209 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. దానిని ప్యాకెట్ల రూపంలో కారులో ఉత్తరప్రదేశ్‌కు రవాణా చేస్తుండగా.. శ్రీకాకుళం జిల్లా పొందూరు–చిలకపాలెం మధ్య పోలీసులకు పట్టుబడ్డారు. వారిద్దరినీ అరెస్టు చేసి.. గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

# ఉన్నత విద్యను అందరికీ చేరువ చేస్తాం



అమరావతి/ఏలూరు అర్బన్, అక్టోబరు17 (సందేశం టైమ్స్): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌గా ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కర్ రావు మంగళగిరిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ఓపెన్ యూనివర్సిటీ ద్వారా యువతకు ఉపయుక్తమైన కోర్సులు అందుబాటులోకి తెస్తామన్నారు. దూరవిద్య ద్వారా ఉన్నత విద్యను చేరువ చేస్తామని చెప్పారు. విశ్వవిద్యాలయం కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను రెండ్రోజుల్లోగా అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. విద్యార్థులు నష్టపోకుండా డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు కొన్ని రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తామని, నవంబర్ నుంచే విద్యా సంవత్సరం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మండలి వైస్ చైర్‌పర్సన్–2 రత్నశీల మణి, కార్యదర్శి బి.తిరుపతిరావు, జాయింట్ సెక్రటరీ కృష్ణమూర్తి, ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగ జోషి పాల్గొన్నారు.

# రికార్డు స్థాయిలో చీరమేను ధర..

## పోటెత్తిన మాంసాహార ప్రియులు

యానాం, అక్టోబరు17 (సందేశం టైమ్స్): దీపావళి రోజుల్లో గోదావరి, సముద్ర సంగమ ప్రాంతంలో లభించే అరుదైన చేప చీరమేను. దీనిని కొనుగోలు చేసేందుకు శుక్రవారం యానాంకు మాంసాహార ప్రియులు పోటెత్తారు. దీంతో సెరు చీరమేను ధర రూ. 16 వేల వరకు పలికింది. పెద్దదారం సైజులో ఉండే చీరమేనును మత్స్యకారులు లీటర్ల లెక్కన విక్రయిస్తారు. తూర్పు గాలులు వీచే వేళ.. సముద్రం, గోదావరి నది కలిసే ప్రాంతంలో ఇది లభిస్తుంది. ఈ సమయంలో నీటి అడుగు భాగం నుంచి అవి నీటిపైకి చేరుకొంటాయి. ఈ చీర మేనను ఈ రోజు మత్స్యకారులు భారీగా మార్కెట్‌కు తీసుకు వచ్చారు. దాంతో స్థానిక రాజీవ్ బీచ్‌లోని పుష్కర్ ఘాట్ వద్ద సందడి వాతరవరణం నెలకొంది. శీతాకాలం ప్రారంభంలో.. మరి ముఖ్యంగా దీపావళి ముందు దశమి, ఏకాదశ




రోజుల్లో ఈ చీరమేను లభ్యమవుతుంది. వీటిని కొనుగోలు చేసేందుకు మాంసహార ప్రియులు పోటీ పడ్డారు. గత రెండు రోజుల క్రితం సెరు రూ. రెండు వేలకుపైగా విక్రయించారు. ప్రస్తుతం సెరు ధర రూ. 1,600కు విక్రయిస్తున్నారు. మరో వారం రోజుల పాటు చీరమేను లభ్యమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ చీరమేనుకు మసాలా దట్టించి వేపుడుగా చేస్తారు. అలాగే చింతకాయ తొక్కుతో కూరగా కూడా వండుకుంటారు. దీనిని గారెలతో కలిపి తినేందుకు మాంసాహార ప్రియులు అమితంగా ఇష్ట పడతారని చెబుతారు.

# అపరిశుభ్రంగా గ్రామాలు - ప్రమాదభరితంగా వీధులు

చీరాల,అక్టోబరు17 (సందేశం టైమ్స్):కొద్దిరోజులుగా నియోజకవర్గంలో కురుస్తున్న ఎడతెరపిలేని నాన్పుడు వానతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారులు సైతం నీళ్లు నిండి కాలువలను తలపిస్తు న్నాయి. అంతేకాకుండా కొన్ని రోడ్లు మురుగు నీటితో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. మరొకొన్ని రోడ్లు కోతకు గురికావడంతో ఆ ప్రాంతాల్లో వాహనదారులు పట్టుతప్పి కింద పడుతున్నారు. గతంలో పాలకులు మరమ్మతులు చేపట్టిన అది క్షేత్రస్థాయిలో అమలు జరగలేదు. కొన్నిచోట్ల మరమ్మతులు చేపట్టినా, సేవలు పారదర్శకంగా లేకపోవడంలో నీళ్లుభారీగా నిలుస్తు న్నాయి. ఈపూరుపాలెం వద్ద నుంచి పలు ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగానే ఉన్నాయి. దీంతో నిత్యం చీరాల నుంచి బాపట్ల, గుంటూరు, విజయవాడకు వెళ్లే బస్సులు, భారీ వాహనాల వారు నానా తంటాలు పడుతున్నారు. ఇదిలా ఉంటే ఈ మార్గంలోనే ఈపూరుపాలెం వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. అంతేకాకుండా వంతెనపై గుంతలు పడుతున్నాయి. దాదాపుగా మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అంచుల్లో ఉన్న దిమ్మెలు పూర్తిగా విరిగిపోయాయి. దీనికి తోడు నాన్పుడు



వాన తోడు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు యుద్ధప్రాతిపదికన అవసరాలకు అనుగుణం గా నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టకుంటే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని ప్రజలు, విశ్లేషకులు చెబుతున్నారు.

జీతాలు లేక పనులకు రాక..

ఎన్నికలు లేని కారణంగా పంచాయతీలకు నిధుల్లేవు. దీంతో పారిశుధ్య కార్మికులకు జీతభత్యాలు అందడం లేదు. ఒక్కో పంచాయతీలో నాలుగు లేక ఆ పైనే మాసాలకు సంబంధించి జీతాలు నిలిచాయి. దీంతో దాదాపుగా నియోజకవర్గంలో సింహ భాగం గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు పనులకు మొరాయించారు. ఈ క్రమంలో వీధులు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

# రోడ్డు పనులను పరిశీలించిన కలెక్టర్



పెద్దపప్పూరు, అక్టోబరు17 (సందేశం టైమ్స్): ముచ్చుకోట సమీపాన ఎనహెచ 544డీ రోడ్డు పనులను, గ్రామ సమీపాన టోల్‌ప్లాజా పనులను కలెక్టర్ ఆనంద్ పరిశీలించారు. ఆయన కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. గ్రామంలోని రోడ్డు విస్తరణతో భూములు, ఇళ్లు కోల్పోయిన వారి నష్టపరిహారం గురించి ఆరా తీశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్వేత, వీఆర్వో లక్ష్మన్న, రెవెన్యూ సిబ్బంది జాఫర్ ఉన్నారు.

# దుర్గమ్మకు కానుకగా విశేష వజ్రాభరణాలు



531 గ్రాముల ఆభరణాలు అందించిన కీర్తిలాల్ కుటుంబం

విజయవాడ (ఇంద్రకీలాద్రి),అక్టోబరు17 (సందేశం టైమ్స్):ప్రముఖ స్వర్ణ, వజ్రాభరణాల విక్ర య సంస్థ కీర్తిలాల్ జ్యూవెల్లర్స్ నిర్వాహకులు వజ్రా లు పొదిగిన 531 గ్రాముల బంగారంతో కూడిన సూర్యుడు, చంద్రుడు, ముక్కు పుడక, బులాకీ, బొట్టు, మంగళ సూత్రాలు, గొలుసు బంగారు ఆభరణాలను కనకదుర్గ అమ్మవారికి అందజేశారు. తమిళనాడు గవర్నర్ సతీమణి లక్ష్మీ రవి, మాజీ ఎంపీలు గోకరాజు గంగరాజు, కనుమూరి బాపిరాజు, కీర్తిలాల్ కాళిదాస్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ తదితరులు రాత్రి ఇంద్రకీలాద్రిపై ఆలయ చైర్మన్ బొర్రా గాంధీ, ఈవో శీనానాయక్‌కు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద ఆశీర్వచన మండపంలో సురాజ్ శాంతకుమార్, తల్లిదండ్రులకు, వారి వెంట వచ్చిన వారికి వేద ఆశీస్సులు అందించారు. అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

# బీసీ గురుకుల పాఠశాల తనిఖీ



వెల్దుర్తి టౌన్, అక్టోబరు17 (సందేశం టైమ్స్): వెల్దుర్తిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలను బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో సరుకులు నాణ్యత లేకపో వడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా ఆమె పాఠశాలలో కల్పిస్తున్న వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠశాలకు సొంత భవనం, మైదానం ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు ఆమె స్పందిస్తూ ఈ విషయంపై పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తమ దృష్టికి తెచ్చారని, త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆమె స్టోర్ రూంను పరిశీలించారు. అందులో ప్రతి వస్తువు నాణ్యత లోపించడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులకు అందించే గుడ్డు కేవలం పూర్తి చిన్న సైజు ఉండటంతో ఆమె స్వయంగా గుడ్లను తూకం వేశారు. 40గ్రాముల గుడ్డు రావడంతో గుడ్లతో పాటు సరుకులను పరీక్షకు పంపించాలని మంత్రి సవిత పీఏకు సూచించారు. అలాగే స్టాఫ్ రిజిస్టర్, గోడౌన్ స్టాక్ రిజిస్టర్ అందుబాటులో లేకపోవడంతో ఇందుకు ఆమె రిజిస్టర్ బుక్‌లో కంప్లైంట్ రాశారు. కళాశాలలోని ప్రతి వస్తువును, ప్రతి రూమ్‌ను, భోజనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్‌గౌడు, బొమ్మిరెడ్డిపల్లె సుబ్బ రాయుడుతో మాట్లాడుతూ స్థానిక టీడీపీ లీడర్లు పాఠశాలపై దృష్టి సారించాలని, వాటి వల్ల నిర్వహణ అభివృద్ధి చెందుతుందని సూచించారు.

# ఆక్రమణల పర్వానికి హైడ్రా ఫుల్‌స్టాప్..
# రూ.110 కోట్ల విలువైన భూమికి విముక్తి



ఇంటర్నెట్ డెస్క్,అక్టోబరు17 (సందేశం టైమ్స్): హైదరాబాద్ మహానగరం నడిబొడ్డున ఆక్రమణల పర్వానికి హైడ్రా ఫుల్‌స్టాప్ పెట్టింది. సిటీలోని గోషామహల్ నియోజకవర్గం కుల్సుంపురాలో కబ్జాలను తొలగించింది. రూ.110 కోట్ల విలువైన 1.30 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకుంది. ప్రజావసరాలకు ఈ భూమిని వినియోగించాలని భావించిన ప్రభుత్వం.. డబుల్ బెడ్ రూం ఇళ్లకు ప్రతిపాదనలు చేస్తోంది.పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఆసిఫ్‌నగర్ మండలం గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని కుల్సుంపూర్ విలేజ్‌లోని సర్వే నంబరు 50లో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. అశోక్ సింగ్ అనే వ్యక్తి ఆక్రమణలో ఉన్న మొత్తం 1.30 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించి.. అందులో షెడ్డులు వేసి విగ్రహ తయారీదారులకు అశోక్ సింగ్ అద్దెకు ఇస్తున్నట్లు తెలిపింది. దీంతో కుల్సుంపురలో ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ హైదరాబాద్ కలెక్టర్ హైడ్రాను కోరారు. ప్రజావసరాల కోసం వినియోగించాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది.గజం స్థలం కూడా దొరకని కుల్సుంపురలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. హైడ్రాకు ప్రజావాణిలో కూడా స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు.. రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకొని కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆక్రమణలను తొలగించింది. ఈ స్థలం తన భూమిగా పేర్కొంటూ సిటీ సివిల్ కోర్టును అశోక్ సింగ్ అనే వ్యక్తి ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం, ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు చెప్పారు.ఇప్పటికే రెవెన్యూ అధికారులు రెండు సార్లు ఆక్రమణలను తొలగించారు. అయినా ఆ స్థలం ఖాళీ చేయకుండా అశోక్ సింగ్ అద్దెలు అనుభవిస్తూ వస్తున్నాడు. ఖాళీ చేయించేందుకు ప్రయత్నించిన అధికారులపై అశోక్ సింగ్ దాడులకు పాల్పడ్డాడు. అశోక్ సింగ్‌పై వివిధ పోలీసు స్టేషన్లలో భూ కబ్జాదారుడుగా, రౌడీ షీటర్‌గా పేర్కొంటూ పలు కేసులు నమోదయ్యాయి లంగర్‌హౌస్, మంగళహాట్, శాహినాయత్‌గంజ్ పోలీసు స్టేషన్లలో అశోక్ సింగ్‌పై 8కి పైగా కేసులు నమోదయ్యాయి.అటు ఇదే ప్రభుత్వ భూమికి ఆనుకుని ఉన్న ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించింది.


# కాసేపట్లో జిమ్ ఓపెనింగ్... కానీ అంతలోనే



హైదరాబాద్, అక్టోబరు17 (సందేశం టైమ్స్):జిమ్ ఓపెనింగ్ సందర్భంగా అప్పటి వరకు ఆ ప్రాంగణమంలో సందడి నెలకొంది. మరికొద్దిసేపట్లో జిమ్ ఓపెనింగ్‌కు అంతా సిద్ధం చేస్తున్నారు. ఎమ్మెల్యే వచ్చి జిమ్‌ను ప్రారంభం చేయనుండటంతో అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాడు జిమ్ ఓనర్. కానీ అంతలోనే అక్కడ పెను విషాదం చోటు చేసుకుంది. సందడిగా, ఉత్సాహంగా ఉన్న ఆ ప్రాంతంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఎంతో కష్టపడి జిమ్‌ను సిద్ధం చేసి కాసేపట్లో ప్రారంభోత్సవం జరుగుతుందని భావించిన జిమ్ ఓనర్‌కు పెద్ద షాక్ తగిలింది. ఇంతకీ జరిగిందో ఇప్పుడు చూద్దాం.నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదర్ షా కోట్‌లో విషాదం చోటు చేసుకుంది. జిమ్ ఓపెనింగ్ కోసం లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా కరెంట్ షాక్ తగిలింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. జిమ్ ఓనర్ రాకేష్.. తన జిమ్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను ఆహ్వానించారు. కాసేపట్లో ఎమ్మెల్యే వస్తారని సమాచారం అందడంతో డిజైనింగ్ లైట్లు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు సిబ్బంది. ఇంతలోనే విషాదం చోటు చేసుకుంది.

లైట్లు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో కరెంట్ షాక్ తగడంతో శివ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని శివ డెడ్ బాడీని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన వ్యక్తిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిమ్ ఓనర్ రాకేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిమ్ ఓపెనింగ్ ప్రాంతంలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది.

# ఇది తెలిస్తే
# అద్దెకు ఉండాలంటే కూడా భయపడతారేమో...



హైదరాబాద్, అక్టోబరు17 (సందేశం టైమ్స్): నగరంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. అద్దెకు ఉంటున్న వారి పట్ల ఆ ఇంటి యజమాని ప్రవర్తించిన తీరు ఇప్పుడు సంచలనంగా మారింది. అద్దెకు ఉంటున్న వారు తమ ఇంట్లో ఏమన్నా రిపేర్ వస్తే ఓనర్‌కు చెప్పడం కామన్. దానిని వారు రిపేర్ చేపిస్తుంటారు. అదే విధంగా ఓ దంపతులిద్దరు కూడా ఇంట్లోని బాత్రూమ్‌లో బల్బ్ హోల్డర్ పనిచేయడం లేదని యజమానికి చెప్పారు. అయితే అతడు చేసిన పాడు పని చూసి అవాక్కయ్యారు దంపతులు. ఇదేంటని ప్రశ్నించగా.. తిరిగి వారినే బెదిరించాడు సదరు ఓనర్. ఇంతకీ ఇంటి ఓనర్ చేసిన పాడు పని ఏంటో చూద్దాం.నగరంలోని మధురానగర్ యూసఫ్‌గూడలో దంపతులిద్దరు ఓ ఇంట్లో రెంట్‌కు ఉంటున్నారు. ఈ క్రమంలో వారి ఇంటిలోని బాత్రూమ్‌లో బల్బ్ పనిచేయడం లేదు. ఇదే విషయాన్ని వారు ఓనర్ అశోక్ యాదవ్‌కు తెలిపారు. ఇక్కడే అతడు తన వక్రబుద్ధిని బయటపెట్టాడు. దంపతులకు తెలీయకుండా బాత్రూమ్‌లోని బల్బ్ హోల్డర్‌లో రహస్య కెమెరాను ఏర్పాటు చేశాడు ఇంటి యజమాని. ఇందుకు అతడికి ఎలక్ట్రిషన్ చింటూ సహాయపడ్డాడు. ఆ తరువాత ఏమీ తెలియకుండా అంతా రిపేర్ చేసినట్లు రెంటర్‌కు చెప్పి వెళ్లిపోయారు. అయితే బల్బ్ హోల్డర్‌లో కెమెరా ఉన్నట్లు బాధితురాలి భర్త ఉమేష్ గుర్తించి షాక్‌కు గురయ్యాడు.ఇదే విషయంపై ఇంటి ఓనర్‌ను ప్రశ్నించగా... తిరిగి దంపతులిద్దరినీ బెదిరింపులకు పాల్పడ్డాడు. కేసు పెడితే జైలు నుంచి వచ్చాక చంపేస్తామని దంపతులిద్దరినీ నిందితులు బెదిరించారు. అయినప్పటికీ తమకు జరిగిన అన్యాయంపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో దంపతులు ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు ఇంటి ఓనర్ అశోక్ యాదవ్‌ను అరెస్ట్ చేశారు.

# హీరోయిన్ల ఓటర్ కార్డులు ఫేక్..
# తేల్చిన ఈసీ, కేసు నమోదు




ఇంటర్నెట్ డెస్క్, అక్టోబరు17 (సందేశం టైమ్స్): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రముఖ హీరోయిన్లకు ఓటు ఉందంటూ ఓటర్ కార్డులు సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. టాలీవుడ్ హీరోయిన్లు తమన్నా, సమంత, రకుల్ ప్రీత్‌సింగ్ పేరుతో ఓటర్ల జాబితా సోషల్ మీడియాలో హల్చల్ అయింది. ఓటర్ల జాబితా సర్కులేషన్‌పై సిరియస్ అయిన ఎన్నికల అధికారులు.. తాజాగా ఆ ఓటరు జాబితా ఫేక్ అని తేల్చారు. ఈ మేరకు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సయ్యద్ యాహియా కమల్ మధుర నగర్ పోలీసులకు పిర్యాదు చేశారు. ఎన్నికల అధికారి పిర్యాదు మేరకు 336(4), 353(1)(%జ) దీచీా% సెక్షన్ల కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.గత రెండు రోజులుగా జూబ్లీహిల్స్‌లో ప్రముఖ హీరోయిన్లకు ఓటు ఉందంటూ ఫేక్ ఓటర్ కార్డులు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. టాలీవుడ్ హీరోయిన్లు రకుల్ ప్రీత్ సింగ్, సమంత, తమన్నాల ఫోటోలతో ఫేక్ ఓటర్ ఐడీలు క్రియేట్ చేసి కేటుగాళ్లు ప్రచారం చేశారు. వేరే ఓటర్ల ఎపిక్ నంబర్ తో హీరోయిన్ల ఫోటోలు పెట్టి ఓటర్ ఐడీ కార్డులు తయారు చేశారు. ఈ ఓటర్ ఐడీల ప్రచారంపై హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ వీటిని ఫ్యాబ్రికేట్ చేశారు? ఎవరు ప్రచారం చేశారు? అన్న అంశాలపై ఎన్నికల సంఘం విచారణ చేపట్టింది. సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్లాస్టిక్ ఫ్యాక్టరీలో ఘోర
# అగ్నిప్రమాదం.. భారీగా ఆస్తినష్టం



హైదరాబాద్ అక్టోబరు17 (సందేశం టైమ్స్)::రాత్రి ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. నగరంలోని పేట్ బషీరాబాద్‌లోని ధూలపల్లి చైనా బజార్‌లో ప్లాస్టిక్ కవర్లను తయారు చేసే పాలిమర్స్ కంపెనీలో అగ్నిప్రమాదం జరిగింది. ప్లాస్టిక్ ఫ్యాక్టరీ కావడం వల్ల మంటలు వేగంగా కంపెనీ మొత్తం వ్యాపించాయి. వెంటనే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, మంటలను అదుపు చేసేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తినష్టం వాటిల్లినట్టు ఫైర్ సిబ్బంది వెల్లడించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# భార్యపై కోపం.. అత్తింటిని
# తగలబెట్టిన భర్త.. ఏమైందంటే?




ఆసిఫాబాద్, అక్టోబరు17 (సందేశం టైమ్స్): ఈ మధ్య భార్యా భర్త మధ్య గొడవలు తారా స్థాయికి చేరుకుంటున్నాయి. వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమని భార్యాభర్తలు ఒకరికి ఒకరు దూరం అవుతున్నారు. చిన్నచిన్న గొడవలు, మనస్పర్థలుగా మారి తీవ్ర ఘర్షణకు దారితీస్తుంది. ఎవరికివారు తాడోపేడో తేల్చుకొని దూరం అవుతుంది. కొందరు గొడవలు పెట్టుకొని దూరం అవుతుంటే.. మరికొందరు ఏకంగా ప్రాణాలే తెస్తున్నారు. కొత్త కొత్త స్ట్రాటజీలు వేస్తూ దారుణ హత్యలు చేస్తున్నారు. యూట్యూబ్ లో చూసి మరీ హత్యలకు ప్లాన్ చేస్తున్నారు. ఒళ్ళు గగుర్పొడిచే విధంగా ఇటీవల ఘటనలు జరుగుతున్నవిషయం తెలిసిందే.తాజాగా తెలంగాణలో మరో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలంలో భార్యపై కోపంతో అత్తింటికి నిప్పు పెట్టిన ఘటన జరిగింది. జైనూర్ మండల కేంద్రానికి చెందిన ముజాహిద్ బేగ్‌తో ఎల్లాపాటార్‌కు చెందిన షమాబీకి 9 నెలల కిందట పెళ్లి అయింది. తనకు పెళ్లి ఇష్టం లేదంటూ ముజాహిద్.. షమాబీతో ఎప్పుడూ ఘర్షణకు దిగేవాడు. ఈ క్రమంలోనే ఇటీవల ఓ రోజున జరిగిన గొడవ చిలికి చిలికి గాలివానలా మారగా 20 రోజుల కిందట షమాబీ పుట్టింటికి వెళ్లింది.దీంతో గురువారం ఎల్లాపాటార్‌కు వచ్చిన అతడు భార్యతో గొడవకు దిగాడు. మాటా మాటా పెరగటంతో భర్త కోపానికి అవధులు లేకుండా పోయాయి. ఆగ్రహంతో రగిలిపోతున్న అతడు.. ఇంట్లోకి వెళ్లి గ్యాస్ సిలిండర్ పైపు లీక్ చేసి నిప్పంటించి అక్కడినుంచి జంప్ అయ్యాడు. మంటల్లో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనపై కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగన్న వెల్లడించారు.

# తహసీల్దార్ల నుంచి ఫైళ్లు కదలడం లేదు




హైదరాబాద్, అక్టోబరు17 (సందేశం టైమ్స్): భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకున్నవారు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదు. సాదాబైనామా, పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం, డేటా కరక్షన్ జీపీఏ, నిషేధిత భూములు, నాలా, ఖాతా మెర్జింగ్, పెండింగ్ మ్యుటేషన్లు, వారసత్వ హక్కులు, అర్బన్ ల్యాండ్ సీలింగ్ వివాదాలకు సంబంధించిన దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయం దాటడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఎప్పుడు వెళ్లి అడిగినా సీసీఎల్ఏ నుంచి స్పష్టత రాలేదు.. విధివిధానాలు రాలేదు.. మార్గదర్శకాలు రావాల్సి ఉందంటూ దరఖాస్తుదారులను తిప్పిపంపుతున్నారనే విమర్శలున్నాయి. ఇలాంటి సమస్యలకు సంబంధించి ఈనెల 14వ తేదీ వరకు 96,316 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే అందులో 54,346 దరఖాస్తులు తహసీల్దార్ స్థాయిలో 18,796 దరఖాస్తులు ఆర్డీవో స్థాయిలో, 11,730 దరఖాస్తులు అదనపు కలెక్టర్ల స్థాయిలో, 11,444 కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి.



# క్రీడావార్తలు



## మ్యాచ్‌కు ముందు రోజు రాత్రంతా రోదనే..

## వరుణ్ చక్రవర్తి ఆసక్తికర కామెంట్స్

ఇంటర్నెట్ డెస్క్: ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ విజయాల్లో టీమిండియాకు కీలకంగా నిలిచిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి. అయితే, కీలక మ్యాచ్‌లకు అతడు ఎలా సిద్ధమవుతాడో తాజాగా చెప్పుకొచ్చాడు. 'కొత్త మ్యాచ్‌లకు ముందు నేను చాలా ఇబ్బంది పడతాను. టోర్నీ ముందు రోజు రాత్రంతా రోదిస్తా. రేపేమవుతుందో, ఎలా గడుస్తుందో అన్న ఆలోచనలు నన్ను కుదిపేస్తాయి' అని చెప్పుకొచ్చాడు. ప్రతి టోర్నీకి ముందు ఇలాగే జరుగుతుందని అన్నాడు. క్రికెట్ టాక్ షో 'బ్రేక్‌ఫాస్ట్ వింత్ ఛాంపియన్స్'లో ఈ కామెంట్స్ చేశాడు %ఇటీవల కాలంలో టాప్ బౌలర్‌గా కూడా వరుణ్ చక్రవర్తి పేరు తెచ్చుకున్నాడు. ఈ గుర్తింపుపై కూడా అతడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'నేను ఇప్పుడు చెస్‌ను ఫాలో అవుతున్నాను. ఇటీవల గుకేశ్ వరల్డ్ చాంపియన్ షిప్ గెలిచినప్పుడు ఆసక్తికర కామెంట్స్ చేశాడు. తాను వరల్డ్ ఛాంపియన్ అయినా మాగ్నస్ కార్ల్‌సన్ నెం.1 ప్లేయర్ అని ప్రతి ఒక్కరు భావిస్తారని అన్నాడు. నేనూ అంతే.. ఇప్పుడు నేను నెం.1గా ఉండొచ్చు కానీ బుమ్రా టాప్ ప్లేయర్ అని ప్రతి ఒక్కరికీ తెలుసు' అని వ్యాఖ్యానించాడు.



ఇటీవల జట్టు విజయాల్లో వరుణ చక్రవర్తి కీలక పాత్ర పోషిస్తూ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్‌లోకి వచ్చాడు. దుబాయ్‌లో జరిగిన ఆసియా కప్ ఫైనల్‌లో కీలక సమయంలో పాక్ ప్లేయర్లను ఔట్ చేసి ప్రత్యర్థి పతనానికి బాటలు పరిచాడు. వరుణ్ రెండు వికెట్ల తీసుకున్నాక పాక్ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. 113/1 దశ నుంచి 146 పరుగులకే ఆలౌట్ అయిపోయింది. ఇక మైదానంలో దూకుడు కనబరచడమే కాకుండా సోషల్ మీడియాలో తన మాటలు, కామెంట్స్‌తోనూ వరుణ చక్రవర్తి దుమ్మురేపుతుంటాడు. ఆసియా కప్‌ను పీసీబీ చీఫ్ తీసుకెళ్లిపోయినా డోన్ట్ కేర్ అంటూ అతడు పెట్టిన పోస్టు తెగ వైరల్ అయ్యింది. మ్యాచ్ అనంతరం అతడు టీకప్పు పట్టుకుని ఓ ఫొటో దిగి సోషల్ మీడియాలో పంచుకున్నాడు. 'ప్రపంచం అంతా ఒకవైపు, నా దేశం ఒక వైపు.. జైహింద్' అంటూ అతడు పెట్టిన పోస్టు అప్పట్లో తెగ వైరల్ అయ్యింది.

## యూఏఈకి టీ20 ప్రపంచ కప్ బెర్త్



దుబాయ్: యూఏఈ జట్టు వచ్చే ఏడాది జరిగే పురుషుల టీ20 వరల్డ్ కప్‌కు అర్హత సాధించింది. ఆసియా-ఈఏపీ క్వాలిఫయర్స్ టోర్నీలో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో యూఏఈ ఎనిమిది వికెట్లతో జపాన్‌ను ఓడించింది. దాంతో ఈ టోర్నీ లో నేపాల్, ఒమన్‌తో కలిసి మూడో జట్టుగా యూఏఈ టిక్కెట్ దక్కించుకుంది. యూఏఈ ఎంట్రీతో ఈ ప్రపంచకప్‌లో పాల్గొనే మొత్తం 20 జట్లూ ఖరారయ్యాయి. 2026 ఫిబ్రవరి-మార్చిలో జరిగే ఈ వరల్డ్‌కప్‌నకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి.


## వచ్చారు.. మొదలెట్టారు

## నెట్స్‌లో చెమటోడ్చిన రోహిత్, కోహ్లీ



పెర్త్: ఆస్ట్రేలియాతో పరిమిత ఓవర్ల సిరీసలో తలపడేందుకు ఇక్కడ అడుగుపెట్టిన టీమిండియా వెంటనే సాధనలోకి దిగింది. సిరీసలో భాగంగా మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-ఆసీస తలపడనున్నాయి. తొలి వన్డే ఈనెల 19న జరగనుంది. ఈ నేపథ్యంలో గురువారం పెర్త్ చేరుకున్న టీమిండియా వెంటనే ప్రాక్టీస్ మొదలెట్టింది. ముఖ్యంగా స్టార్ బ్యాటర్లు రోహిత్, విరాట్ ఎక్కువ సేపు నెట్స్‌లో గడిపారు. టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన ఈ ఇద్దరు వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న విషయం విదితమే. ఈ ఫార్మాట్‌లో రో-కో చివరిసారి గత మార్చిలో చాంపియన్స్ ట్రోఫీలో ఆడారు. నెట్ ప్రాక్టీస్ తర్వాత కోచ్ గంభీర్‌తో రోహిత్ చాలాసేపు సంభాషించడం ఆసక్తి రేపింది. మరోవైపు సాధనకు ముందు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌తో మాట్లాడిన కోహ్లీ తర్వాత పేసర్ అర్ష్‌దీపతో ముచ్చటించాడు. శుక్ర, శనివారాల్లో కూడా భారత జట్టు ప్రాక్టీస్ చేయనుంది. పెర్త్ చేరిన క్రికెటర్లు..: తొలి విడతగా బుధవారం ఉదయం న్యూఢిల్లీ నుంచి బయలుదేరిన భారత క్రికెటర్లు రోహిత్, కోహ్లీ, కెప్టెన్ గిల్, కేఎల్ రాహుల్, జైస్వాల్, అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, నితీశ్ కుమార్‌తోపాటు కొందరు సహాయ సిబ్బంది గురువారం తెల్లవారుజామున పెర్త్ చేరుకున్నారు. వారు ప్రయాణించిన విమానం మూడున్నర గంటలు ఆలస్యంగా వచ్చింది. ఆ తర్వాత కోచ్ గంభీర్, కుల్దీప్, అక్షర్, బౌలింగ్ కోచ్ మోర్కెల్, ఇతర కోచింగ్ సిబ్బంది పెర్త్ చేరుకున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ భారత్ తరఫున బరిలోకి దిగబోతున్నారు. అయితే ఆదివారం ఆసీసతో జరిగే తొలి వన్డే ఈ ద్వయానికి సవాల్‌గా మారనుందని మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా తెలిపాడు. 'ఐపీఎల్‌లో ఆడిన తర్వాత విరాట్, రోహిత్ మళ్లీ ఇప్పుడే బ్యాట్ పట్టనున్నారు. అదీ బౌన్స్ అధికంగా ఉండే పెర్త్ పిచ్‌పై తొలి మ్యాచ్ కావడం వారికి ఇబ్బందికరమే. అయితే ఈ మూడు వన్డేలు ఆ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్ల భవిష్యత్‌ను నిర్ణయించలేవు' అని చోప్రా స్పష్టం చేశాడు. మరోవైపు విరాట్-రోహిత్‌లకు ఆసీస్ పర్యటన అంత సులువు కాదని, కుదురుకునేందుకు సమయం పడుతుందని మాజీ క్రికెటర్ షేన్ వాట్సన్ అభిప్రాయపడ్డాడు. ఇక విదేశీ ఫ్రాంచైజీ లీగ్‌ల్లో ఆడేందుకు భారత యువ ఆటగాళ్లను అనుమతించాలని మాజీ కోచ్ రవిశాస్త్రి కోరాడు.

## శ్రీరామ్‌కు కాంస్యం



డ్యూరెస్ (అల్బేనియా): ఫిడే ప్రపంచ యూత్ చెస్ చాంపియన్‌షిప్ అండర్-18 విభాగంలో హైదరాబాద్‌కు చెందిన ఉప్పల శ్రీరామ్ ఆదర్శ్ కాంస్యం సాధించాడు. 11 రౌండ్ల ఈ చాంపియన్‌షిపలో శ్రీరామ్ మొత్తం 8.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. చివరి రౌండ్‌లో సింగపూర్‌కు చెందిన జేవియర్ హబన్స్‌తో గేమ్‌ను ఆదర్శ్ డ్రా చేశాడు. సిద్దార్థ్ జగదీశ (సింగపూర్) స్వర్ణం, అర్టియమ్ స్ట్రిబక్ (ఫిడే) రజత పతకం నెగ్గారు.

## సెమీస్‌లో ఆస్ట్రేలియా



మహిళల వన్డే వరల్డ్‌కపలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా అదరగొడుతోంది. అజేయ ఆటతీరుతో దూసుకెళ్తున్న ఈ జట్టు సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. గురువారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్ అలీసా హీలీ (77 బంతుల్లో 20 ఫోర్లతో 113 నాటౌట్) వరుసగా రెండో శతకం పూర్తి చేయగా, లిచ్‌ఫీల్డ్ (72 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్‌తో 84 నాటౌట్) సహకరించింది. దీంతో ఏకంగా 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించిన ఆసీస్ 9 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 198 పరుగులు సాధించింది. శోభన (66 నాటౌట్), రుబియా హైదర్ (44) రాణించడంతో ఆ మాత్రం స్కోరైనా అందుకోగలిగింది. మహిళల క్రికెట్‌లో ఆసీసపై బంగ్లా తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు శోభనదే కావడం విశేషం. అటు బౌలింగ్‌లో లెగ్ స్పిన్నర్ అలన కింగ్ (10-4-18-2) పొదుపైన బౌలింగ్‌తో అదరగొట్టింది. వేర్హమ్, సదర్లాండ్, గార్డ్‌నర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆస్ట్రేలియా 24.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 202 పరుగులతో నెగ్గింది. ఓపెనర్లు హీలీ, లిచ్‌ఫీల్డ్ చెలరేగడంతో పవర్‌ప్లేలోనే జట్టు 78 పరుగులు సాధించింది. 67 రన్స్ దగ్గర హీలీ సులువైన క్యాచ్‌ను ఫర్గానా వదిలేసింది. ఇక వరల్డ్‌కపలో రెండో ఫాస్టెస్ట్ (73 బంతుల్లో) సెంచరీ పూర్తి చేసిన హీలీ ఆ వెంటనే హ్యాట్రిక్ ఫోర్లు బాదగా, అటు 25వ ఓవర్‌లో లిచ్‌ఫీల్డ్ రెండు వరుస ఫోర్లతో మ్యాచ్‌ను ముగించింది.

## అభిషేక్ శర్మ, స్మృతి మంధానకు ఐసీసీ అవార్డ్!



టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ, భారత మహిళల స్టార్ ప్లేయర్ స్మృతి మంధానకు అరుదైన అవార్డ్ దక్కింది. సెప్టెంబర్ నెలలో ఉత్తమ ప్రదర్శన కనబర్చినందుకు ఈ ఇద్దరి ప్లేయర్లకు 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డ్' వరించింది. దుబాయ్ వేదికగా జరిగిన ఆసియా కప్ 2025 టోర్నీలో అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిన విషయం తెలిసిందే. ఆసియా కప్ 2025 టోర్నీలో 7 మ్యాచ్‌లు ఆడిన అభిషేక్ శర్మ 200 స్ట్రైక్‌రేట్, 44.58 సగటుతో 314 పరుగులు చేశాడు. అంతేకా ఆ టోర్నీలో ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అవార్డ్ అందుకున్నాడు. అతని అద్భుత బ్యాటింగ్ తో ఈ టోర్నీలో టీమిండియా ఓటమి అనేది లేకుండా విజేతగా నిలిచింది. అలానే ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ వరల్డ్ నెంబర్ వన్ టీ20 బ్యాటర్‌గా కూడా కొనసాగుతున్నాడు. అభిషేక్ శర్మ పాటు ఈ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన కుల్దీప్ యాదవ్ కూడా ఈ అవార్డ్ రేసులో నిలిచాడు. జింబాబ్వే ప్లేయర్ బ్రియాన్ బెన్నెట్ కూడా పోటీ పడగా.. అభిషేక్ శర్మకే ఈ అవార్డ్ వరించింది. అభిషేక్ శర్మ కెరీర్‌లో ఇదే తొలి ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డ్‌కావడం గమనార్హం. ఇక స్మృతి మంధానకూడా ఆస్ట్రేలియాతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చింది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో 58, 117, 125 పరుగులతో సత్తా చాటింది. ఈ సిరీస్‌లో మంధాన 50 బంతుల్లోనే సెంచరీ బాది ఆకట్టుకుంది. మంధానతో పాటు సౌతాఫ్రికా బ్యాటర్ టాజ్మిన్ బ్రిట్స్, పాకిస్థాన్ ప్లేయర్ సిద్రా అమిన్ ఈ అవార్డ్ రేసులో నిలవగా మంధాననే వరించింది.

## బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లో చాముండేశ్వర్‌నాథ్



న్యూఢిల్లీ: మాజీ క్రికెటర్ వంకిన చాముండేశ్వర్‌నాథ్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అత్యున్నత కమిటీలో చోటు లభించింది. బోర్డు అపెక్స్ కౌన్సిల్‌లో భారత క్రికెటర్ల సంఘం (ఐసీఏ) ప్రతినిధిగా చాముండి (66) ఎన్నికయ్యాడు. బుధ, గురువారాల్లో జరిగిన ఆన్‌లైన్ ఓటింగ్‌లో చాముండి 672 ఓట్ల భారీ తేడాతో ప్రత్యర్థి రాజేష్ వి. జడేజాపై భారీ విజయం సాధించాడు. చాముండికి 755 ఓట్లు పోల్‌కాగా.. జడేజాకు 83 ఓట్లు మాత్రమే లభించాయి. బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌కు ఎన్నికైన తొలి తెలుగు వ్యక్తిగా నిలిచిన చాముండి భారత జట్టు మాజీ క్రికెటర్ దిలీప్ వెంగ్‌సర్కార్ స్థానంలో ఈ బాధ్యతలు చేపట్టనున్నాడు. బీసీసీఐకి సంబంధించిన అత్యున్నత నిర్ణయాలను తీసుకొనే బాడీ అపెక్స్ కౌన్సిల్. ఇందులో బోర్డు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, ఇద్దరు ఐసీఏ సభ్యులు, 'కాగ్', జనరల్ బాడీనుంచి ఒక్కొక్కరు...ఇలా 9 మంది ఉంటారు. కాగా ఐసీఏ మహిళా నామినీగా సుధా షా, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ప్రతినిధిగా శుభాంగి దత్తాత్రేయ కులకర్ణి ఎన్నికయ్యారు. ఇక ఐసీఏ బోర్డు ఎన్నికల్లో చాముండి మినహా అందరి ఎన్నిక ఏకగ్రీవమైంది. రాజమండ్రికి చెందిన చాముండేశ్వ ర్‌నాథ్ ఆంధ్ర తరఫున 1978 నుంచి 1992 వరకు ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడాడు.

# బిజినెస్



# ఇన్ఫీ లాభం రూ.7,364 కోట్లు

## క్యూ2లో 13 శాతం వృద్ధి నమోదు
## వార్షికాదాయ అంచనా 2-3 శాతం జూఒక్కో
## షేరుకు రూ.23 డివిడెండ్




.న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ రూ.7,364 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) లో ఇదే కాలానికి గడించిన రూ.6,506 కోట్ల లాభంతో పోలిస్తే 13.2 శాతం వృద్ధి నమోదైంది. ఈ క్యూ2లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 8.6 శాతం పెరిగి రూ.44,490 కోట్లకు చేరింది. 2024-25 క్యూ2లో రెవెన్యూ రూ.40,986 కోట్లుగా ఉంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయం వృద్ధి అంచనా శ్రేణిని జూన్ త్రైమాసికంలో(క్యూ1)లో ప్రకటించిన 1-3 శాతం నుంచి 2-3 శాతానికి మెరుగుపరిచింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.23 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. క్యూ2 ఆదాయంలో ఆర్థిక సేవల విభాగం వాటా 5.6 శాతం పెరిగి 27.7 శాతానికి చేరుకుంది. మాన్యుఫాక్చరింగ్ విభాగ వాటా 16.5 శాతంగా నమోదైంది. ఎనర్జీ, యుటిలిటీస్, రిసోర్సెస్ అండ్ సర్వీసెస్ విభాగ వాటా 13.4 శాతంగా, రిటైల్ 12.7 శాతం, కమ్యూనికేషన్స్ విభాగ వాటా 12.1 శాతంగా ఉంది. ఈ జూన్ 30 నాటికి కంపెనీలో మొత్తం 3,23,788 మంది ఉద్యోగులుండగా.. ఈ సెప్టెంబరు 30 నాటికి 8,203 పెరుగుదలతో 3,31,991కి పెరిగింది. క్యూ2లో ఉద్యోగుల వలసల రేటు 14.3 శాతానికి తగ్గింది.

౹౹12,000 మంది ఫ్రెషర్ల నియామకం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరుతో ముగిసిన ప్రథమార్ధంలో 12,000 మంది ఫ్రెషర్లను నియమించుకున్నట్లు ఇన్ఫోసిస్ సీఎఫఓ జయేశ్ సంఘ్రుజ్కా తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి ప్రణాళికకు అనుగుణంగా 20,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోనున్నట్లు ఆయన చెప్పారు.

హెచ్1బీ వీసాల అవసరం చాలా తక్కువే..

అమెరికాలోని మా కార్యాలయాల్లో పనిచేస్తున్న మెజారిటీ ఉద్యోగులకు ఇమ్మిగ్రేషన్ మద్దతు అవసరం లేదు. వీసా స్పాన్సర్‌షిప్ అవసరమైన వారు చాలా తక్కువ మందేనని ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ తెలిపారు.అనిశ్చిత వాతావరణం ఇంకా కొనసాగుతోంది. సాధారణంగా ఐటీ రంగంలో ప్రథమార్ధంతో పోలిస్తే ద్వితీయార్ధంలో వ్యాపారం నెమ్మదిస్తుంది. అయితే, కొత్త డీల్స్ చురుకుగా జరుగుతున్న నేపథ్యంలో వార్షికాదాయ అంచనా దిగువ శ్రేణిని 2 శాతానికి పెంచాం. ఈ అంచనాను అందుకుంటామని పూర్తి ధీమాతో ఉన్నాం.

# పుత్తడి ప్రియులకు షాక్..
# భారీగా పెరిగిన బంగారం ధరలు




ఇంటర్నెట్ డెస్క్, అక్టోబర్ 17: అంతర్జాతీయంగా కీలక పరిణామాలు, దీపావళి పండుగ దృష్ట్యా దేశంలో బంగారం ధరలు ఆకాశాన్నంటున్నాయి. తాజాగా మరోసారి బంగారం, వెండి ధరలు పెరిగాయి. శుక్రవారం ఒక్క రోజులోనే తులం బంగారం రూ.3,770 పెరిగింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,35,180 ఉండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,25,690గా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1,85,000గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఇవే ధరలు అమలులో ఉంటాయి.అమెరికాలోని ప్రాంతీయ బ్యాంకులలో బలహీనత సంకేతాలు, ప్రపంచ వాణిజ్య ఘర్షణల నడుమ పెట్టుబడిదారులు బంగారంపై పెట్టుబడి పెట్టేందుకు ఆలోచిస్తున్నారు. దీనిపై ఎమ్కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంపద, సలహా విభాగమైన ఎమ్కే వెల్త్ మేనేజ్‌మెంట్ తమ అంచనాలతో ఓ నివేదిక విడుదల చేసింది. తాజా పరిణామాల దృష్ట్యా వచ్చే ఏడాదిలో వెండి దాదాపు 20% పెరుగుదలను చూడవచ్చని అభిప్రాయం వ్యక్తం చేసింది. ధరలు ఔన్సుకు %వి%60కి చేరుకుంటాయని పేర్కొంది. ఇందుకు పెరుగుతున్న పారిశ్రామిక డిమాండ్, దాదాపు 20% నిరంతర సరఫరా లోటు కారణమని వివరించింద. దేశంలో ధంతేరాస్, దీపావళి పర్వదినం సందర్భంగా బంగారం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ వారాంతం మొత్తం దీపావళి, ధంతేరాస్ (ధన త్రయోదశి) సందడి చేయండి. ధంతేరాస్‌కు ముందే పుత్తడి ధరలు చుక్కలు చూపించడంతో కొనుగోలుదారులు బంగారాన్ని ఎలా కొనాలని యోచిస్తున్నారు.

# 4,300 డాలర్లు దాటిన ఔన్స్ గోల్డ్




అంతర్జాతీయ మార్కెట్లో బంగారం సరికొత్త రికార్డు స్థాయికి ఎగబాకింది. ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు ఒకదశలో 100 డాలర్లకు పైగా పెరిగి తొలిసారిగా 4,300 డాలర్లు దాటింది. అమెరికా-చైనా మధ్య మళ్లీ మొదలైన వాణిజ్య యుద్ధం, యూఎస్ షట్‌డౌన్ వంటి ప్రతికూలతలతో పాటు అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు బులియన్ డిమాండ్‌ను ఎగదోస్తున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఔన్స్ గోల్డ్ 61 శాతానికి పైగా పెరిగింది. భారత్‌లో బంగారం ధరలు ఇంటర్నేషనల్ మార్కెట్ రేటు, డాలర్-రూపాయి మారకం విలువకు అనుగుణంగా మారుతుంటాయి. దీంతో శుక్రవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల పసిడి మరో రూ.2,800కు పైగా పెరిగి రూ.1.35 లక్షలకు చేరువయ్యే అవకాశం కనిపిస్తోంది.

ఎస్‌జీబీలు అదుర్స్: 2017-18 ఆర్థిక సంవత్సరంలో సీరిస్-3 కింద జారీ చేసిన సావరిన్ గోల్డ్ బాం డ్స్ (ఎస్‌జీబీ) కూడా మదుపరులు బంపర్ లాభాలు పంచాయి. 2017 అక్టోబరు 16న జారీ చేసిన ఈ ఎస్‌జీబీల ఫైనల్ రిడంప్షన్ గడువు గురువారంతో ముగిసింది. ఒక్కో గ్రాము రూ.2,860 చొప్పున ఈ బాండ్స్ కొనుగోలు చేసిన వారికి తుది రిడంప్షన్ నాటికి ఒక్కో గ్రాము ఎస్‌జీబీపై రూ.12,567 అందుకున్నారు. అంటే ఎనిమిదేళ్ల కాలపరిమితి ముగిసేసరికి మదుపరులు 388 శాతం లాభం కళ్లజూశారు.

# విప్రో ఆదాయం రూ.22,697 కోట్లు


న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికానికి (క్యూ2) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన ఒక శాతం పెరిగి రూ.3,246.2 కోట్లుగా నమోదైంది. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి కంపెనీ లాభం రూ.3,208.8 కోట్లుగా ఉంది. ఈ క్యూ2లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.7 శాతం పెరిగి రూ.22,697.3 కోట్లకు చేరింది. ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంతో పోలిస్తే మాత్రం విప్రో లాభం 2.5 శాతం తగ్గగా.. ఆదాయం 2.5 శాతం పెరిగింది. ఈ క్యూ2 ఆదాయంలో 34.3 శాతం బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫఎసఐ) రంగం నుంచి సమకూరింది. కన్స్యూమర్ 18.2 శాతం, ఎనర్జీ, మాన్యుఫాక్చరింగ్ అండ్ రిసోర్సెస్ 17.4 శాతం, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్స్ 15.6 శాతం, హెల్త్‌కేర్ రంగం నుంచి 14.5 శాతం రెవెన్యూ లభించింది.

ఏఐ సేవల కోసం విప్రో ఇంటెలిజెన్స్




కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక సేవలను మరింత విస్తృతం చేసేందుకు విప్రో ఇంటెలిజెన్స్‌ను ప్రారంభించింది సంస్థ. ఏఐ పవర్డ్ ప్లాట్‌ఫామ్స్, పరిష్కారాలు, ఆఫరింగ్స్‌తో కూడిన ఈ ఏకీకృత సూట్ ద్వారా కంపెనీ తన క్లయింట్లకు సమగ్ర స్థాయి ఏఐ సేవలందించనుంది. క్లయింట్లు ఏఐ సంబంధిత ప్రాజెక్టులపై ఎక్కువగా వెచ్చిస్తున్నారని విప్రో సీఈఓ, ఎండీ శ్రీనివాస్ పల్లియా అన్నారు.

# మార్కెట్‌కు కొనుగోళ్ల మద్దతు



ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాల ప్రభావం వల్ల గురువారం వరుసగా రెండో రోజు కూడా ఈక్విటీ మార్కెట్లలో ర్యాలీ కొనసాగింది. అమెరికన్ ఫెడరల్ కీలక వడ్డీ రేటు తగ్గిస్తుందన్న ఆశలు మార్కెట్లలో కొనుగోళ్ల జోరును పెంచాయి. సెన్సెక్స్ 862.23 పాయింట్ల లాభంతో 83,467.66 వద్ద ముగియగా నిఫ్టీ 261.75 పాయింట్ల లాభంతో 25,585.30 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1010.05 పాయింట్ల లాభంతో 83,615.48 పాయింట్లను తాకింది. బీఎసఇ స్మాల్‌క్యాప్ సూచీ 0.47%, మిడ్‌క్యాప్ సూచీ 0.29% లాభపడ్డాయి.

ఐపీఓకి డ్యూరోఫ్లెక్స్: మ్యాట్రెసెస్ తయారీ కంపెనీ డ్యూరోఫ్లెక్స్ తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి అనుమతి కోరుతూ సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా తాజాగా రూ.183.6 కోట్ల విలువ గల ఈక్విటీ షేర్లు జారీ చేయనుంది. ఓఎఫ్ఎస్ విధానంలో ప్రమోటర్లు 2.25 కోట్ల ఈక్విటీ షేర్లు విక్రయించనున్నారు.

# రికార్డ్ స్థాయికి వెండి, బంగారం..
# టార్గెట్ ఎంత..

బంగారం, వెండి ధరలు రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడం ఈ అరుదైన లోహాలకు కలిసి వస్తోంది. సెంట్రల్ బ్యాంకు కొనుగోళ్లు, ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల కారణంతో 2025లో బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయి దీపావళికి ముందు, గురువారం బంగారం ధర 10 గ్రాములకు రూ. 1, 29, 440 వద్ద జీవితకాల గరిష్టానికి చేరుకుంది. వెండి ధర కిలోకు రూ. 1, 89, 000 కు చేరుకుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు, బంగారం ధర 66% కంటే ఎక్కువ రాబడిని అందించింది. అలాగే వెండి ధర దాదాపు 87% పెరిగింది. రాబోయే రోజుల్లో ఈ రెండు లోహాలు మరింతగా పైకి ఎగబాకుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అస్థిరత, అడపాదడపా దిద్దుబాట్లు ఉండే అవకాశం ఉన్నప్పటికీ, విశ్లేషకులు బుల్లిష్ దృక్పథాన్ని మాత్రం




కొనసాగిస్తున్నారు %సురక్షిత పెట్టుబడులు, వడ్డీ రేట్లు తగ్గడం, రూపాయి విలువ తగ్గడం, సెంట్రల్ బ్యాంక్ దూకుడుగా పెట్టుబడులు పెట్టడం వంటి కారణాల వల్ల బంగారంలో పెరుగుదల కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1.50 లక్షల దాటుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వచ్చే సంవత్సరంలో బంగారం ధరలు రూ. 1,10,000 - రూ. 1,45,000 మధ్య ఉంటాయని నిపుణుల అంచనా %మరోవైపు వెండి కూడా పెట్టుబడిదారులకు స్వర్గధామంగా మారింది (%ూఅశ్రీజవతీ =ఛ్వ ుశీఝుఎ%). వెండిని కూడా సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. మరోవైపు పారిశ్రామిక వినియోగం కూడా వెండి ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006